
◀ **కథ**

# బొమ్మకైన పుట్టు రిమ్మతెగులు




— వసుంధర

ఒక విధంగా నేను అదృష్ట వంతుణ్ణి. మరో విధంగా దురదృష్ట వంతుణ్ణి.

బొంబాయిలో నెలకు రెండు వేల జీతం. ఇంచు మించు అంతే నెల జీతం తెచ్చుకునే మా బంధువులమ్మాయి గీతను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాను. నా వయసు ఇరవై ఆరు. ఆమె వయసు ఇరవై నాలుగు. మా యిద్దరికీ పగిడీ లేకుండా నెలకు వెయ్యి రూపాయిల అద్దెకే ఓ గది దొరికింది. అదీ నా అదృష్టం.

బంధువులన్నా, స్నేహితులన్నా నాకు అభిమానం. ఇంటర్వ్యూలనో, వ్యాపారమనో, షాపింగ్ అనో చాలామంది బొంబాయి వస్తూ పోతూంటారు. వచ్చిన వారు నా యింట్లోనే వుంటారు. ఉన్నది ఒక్కటే గది. అలాంటి పది గదులకు కలిపి బయట వేరే నాలుగు లెట్రిన్లున్నాయి తప్ప స్నానం, పడక, వంట అన్నీ ఆ గదిలోనే! అందువల్ల బంధు మిత్రుల రాక పేరు చెప్పి నెలకిరవై రోజులు నేను నాతిగల బ్రహ్మచర్యం పాటిస్తూ నాకాంతతో ఏకాంతంగా వుండవలసి వస్తోంది. ఇదీ నా దురదృష్టం.

కొత్తగా పెళ్ళయిన వాళ్ళం. చూపుల తాకిడికే వళ్ళు పరవశించినా మమ్మల్ని విడదీయడానికి అటూ యిటూ సప్తాశ్వాల్ని పెట్టి లాగించినా విడిపోని విధంగా శూన్యం మా యిద్దరి మధ్యా వుండేటంతగా హత్తుకుని పోవాలని మా కోరిక. ఆ కోరికనమల్లో పెట్టే అవకాశాలు అరుదుగా వస్తున్నాయని మా బాధ!

గీతకు బిడియం ఎక్కువ. నా ఎదురుగా బట్టలు మార్చుకుందుకే సిగ్గు పడే తను ఇక స్నానమేం చేస్తుంది? గదిలో ఒక మూలగా నలు చదరప్రు గట్లు నాలుగు సెంటి మీటర్ల ఎత్తువి వున్నాయి. గిన్నెలు తోముకున్నా, పళ్ళు తోముకున్నా అక్కడే! గీత స్నానం చేసేటప్పుడు నేను గదిలోంచి బయటకు వెడతాను. కలిసి స్నానం చేయాలని నా కోరిక. మా పెళ్ళై ఆర్నెల్లయినా ఇంకా అంత విచ్చల విడిగా ప్రవర్తించేటంత చనువు మా మధ్య ఏర్పడలేదు.

ఇలాంటి పరిస్థితిలో నాకు విశ్వనాథం కనిపించాడు. వాడి పెద్దన్న సత్యానిదో విషాద గాథ.

నలుగురన్నదమ్ముల్లో పెద్దవాడు సత్యం. వ్యవసాయం పనులతో మొదట్నించీ తల్లిదండ్రులతో పల్లెటూళ్ళో వుంటున్నాడు. మిగతా ముగ్గురూ ఉద్యోగాల పేరు చెప్పి దూర ప్రాంతాల్లో వుంటున్నారు. ఏడాది క్రితం సత్యం తలిదండ్రులు వారం రోజుల తేడాలో పోయారు. వాళ్ళ నీడలో మసలడం అలవాటైన సత్యం షాక్ తిన్నాడు. అప్పుడే అతడొక రోజున పొలంలో జారిపడగా తలకు బలమైన గాయమయింది. అప్పట్నించీ అతడి చూపు మందగించడం ప్రారంభించింది. డాక్టర్లకు చూపిస్తే మందులేవో యిచ్చి కళ్ళ జోడు మాత్రం వాడకూడదన్నారు. మందులతడికి పెద్దగా పని చేయలేదు. సరిగ్గా నెల రోజుల క్రితం పుట్టింటి నుంచి వస్తూ అతడి భార్య, యిద్దరు బిడ్డలూ బస్సు యాక్సిడెంట్లో మరణించారు. సర్వం కోల్పోయిన సత్యానికి జీవిత మంటే విరక్తిపుట్టి రెండు ఆత్మహత్యా ప్రయత్నాలు చేశాడు. ఊళ్ళో వాళ్ళతణ్ణి కాపాడారు. సత్యం ఆ ఊళ్ళో వుంటే యిక బ్రతకడని గ్రామస్థులు అన్నదమ్ములకు చెప్పారు.

సత్యం వయసు నలభై. అతడి చూపు పూర్తిగా పోయింది. అతడికి జీవించాలన్న ఆశ లేదు. అందుకని విశ్వనాథం సత్యాన్ని బొంబాయి తీసుకుని వచ్చాడు. ఇక్కడ వాడికి తెలిసిన సైకాలజిస్టు

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

గౌరీ శంకర్ వుంటున్నాడు. ముందు సత్యానికి జీవితం మీద ఆసక్తి పుట్టించాలని యింట్లో వాళ్ళ ప్రయత్నం. గౌరీశంకర్ తన్ను తాను నేత్ర వైద్యుడిగా పరిచయం చేసుకుని నేత్ర వైద్యం చేస్తున్నానన్న భ్రమను సత్యానికి కలిగించాడు.

విశ్వనాథం బొంబాయి వచ్చి నాలుగు రోజు లయింది. రోజుకు మాట యాభై రూపాయిల అద్దెనిస్తూ హోటలు గదిలో వుంటున్నాడు. ఇక విశ్వనాథం ఎళ్ళ ఉద్యోగంలో జాయినవ్వాలి. సత్యం బొంబాయిలో కనీసం మూడు నెల లుండాలి. అంతకాలం హోటల్లో వుంచగల స్తోమతు వారికి లేదు. ఎలాగో అది భరిద్దామన్నా సత్యానికి చూపు లేదు. వేరే మనిషి అతణ్ణి చూసుకోవాలి. నెలకు రెండు మూడు వేలిస్తే తప్ప అలాంటి మనిషి దొరకదు. అప్పుడు విశ్వ నాథం నన్ను గుర్తు చేసుకున్నాడు.

నా గుండెల్లో రాయి పడింది. ఇప్పటికే నెల కిరవై రోజులు బంధుమిత్రుల రాకపోకలతో పోతు న్నాయి. ఇప్పుడు వరుసగా మూడు నెలలు...నా వల్ల కాదు. ఆది నిష్ఠూరం మేలని నా యిబ్బంది చెప్పుకున్నాను.

విశ్వనాథం అప్పటికి నిరుత్సాహంగా వెళ్ళి పోయాడు. కానీ మర్నాడే నాకు గౌరీశంకర్నించి పిలుపు వచ్చింది. వెళ్ళాను. ఆయన నా కథంతా ఓపిగ్గా విని యిలా చెప్పాడు.

"జీవితంలో ఎదుటి వాడికి సాయపడ్డంవల్ల కలిగే ఆనందం స్వార్థం వల్ల కలిగే ఆనందం కంటె ఎన్నో రెట్లు గొప్పది. స్వార్థం విడిచి యితరులకు సాయ పడాలనుకుంటే సత్యం వల్ల నీకు నష్టం కంటె లాభమే ఎక్కువ.

"సత్యం పేషెంటు. అదీ మానసికంగా దెబ్బ తిన్నవాడు. అతడు నీ యింట్లో వుంటే యింకె వ్వరూ నీ యింటికి రారు. వచ్చినా పొమ్మనడానికి నీకు మంచి కారణ ముంటుంది."

"సత్యానికి చూపులేదు. మీ భార్యా భర్తలు నిశ్శబ్దంగా అతడి ముందే అన్ని సుఖాలూ అనుభ వించ వచ్చు. అందులోని థ్రిల్ అనుభవిస్తే తప్ప తెలియదు. అదీ కాక నీ భార్యకు బిడియం ఎక్కువంటున్నావు. సత్యం ఉనికి ఆమె బిడి యాన్ని తగ్గించి నీకామెను మరింత దగ్గర చేస్తుంది."

"ఒక్క నెల రోజుల తర్వాత నువ్వు నా దగ్గరకు వచ్చి సత్యాన్ని శాశ్వతంగా మీ యింట్లో వుంచుకుంటాననక పోతే నేను నా వృత్తి మానేస్తాను."

గౌరీ శంకర్ సామాన్యుడు కాదు. అతడి మాటలు నా మీద మంత్రంలా పనిచేశాయి. నా భార్య కయిష్టమని తెలిసి కూడా విశ్వనాథానికి మాటిచ్చాను. సత్యం మా యింటికి వచ్చాడు.

సత్యం మొహమాటస్థుడు. తనకు చూపానని కారణంగా మా కెంతో యిబ్బందని బాధపడ్డాడు. గీత కూడా అతణ్ణి మంచి మాటలతో ఓదార్చ డమే కాక "మీ వంటి పెద్దల రాకవల్ల ఈ గదికి నిండుతన మొచ్చింది" అనేసింది.

రోజూ ఉదయమే సత్యం ముఖం కడుక్కుని స్నానం చేస్తాడు. అతడు స్నానం చేసేప్పుడు వంటి మీద చారల డ్రాయరుంటుంది. తెల్లవారు ఝామున అయిదు కాకుండా అతడి కాల కృత్యా లన్నీ అయిపోతాయి. ఆ సమయంలో మేము గాఢ నిద్రలో వుంటాం. గీత నిద్రలో వుండగానే తన స్నానమైపోవాలని సత్యం పట్టుదల.

ఆరంభంలో రెండ్రోజులు తెల్లవారు ఝామున అతణ్ణి నేను స్వయంగా లెట్రిన్‌కు తీసుకుని వెళ్ళాను. తర్వాత నుంచి అతడికి నా అవసరం లేకపోయింది.

గీతా, నేనూ ఆరున్నర కల్లా లేస్తున్నాం. వెంటనే కాఫీ కలుపుతూంది గీత. ముగ్గురం కాఫీలు తాగేక త్వరగా కాల కృత్యాలు. ఆ వెంటనే వంట. కూరగాయలు తరగడంలో సత్యం సాయం చేస్తు న్నాడు.

విశ్వనాథం సత్యం కోసమని హాట్‌ప్యాక్ కొని చ్చాడు. అతడి వాటా వంట అందులో సర్దేస్తుంది గీత. మేమిద్దరం క్యారియర్సులో ప్యాక్ చేసు కుంటాం. ఎనిమిదికల్లా ముగ్గురం బ్రెడ్ స్లైసులు తింటాం. గీత ఫ్లాస్కులో కాఫీ పోసి వుంచు తుంది. ఎనిమిదిన్నర కల్లా నేనూ, గీతా యిల్లు వదులుతాం. మా ఆఫీసు దూరమేం కాదు. బస్సులో పావుగంట ప్రయాణం. బస్ స్టాపు దాకా వెళ్ళడానికి పావుగంట. ఆఫీసు తొమ్మిదిన్నర నుంచి అయిదు దాకా. మధ్యలో అరగంట లంచి విరామం. మేమిద్దరం ఆరింటికల్లా యిల్లు చేరతాం.

మధ్యాహ్నం పన్నెండింటికి డాక్టర్ గౌరీశంకర్ వచ్చి సత్యంతో ఓ అరగంట గడిపి వెడతాడు. అతడి తృప్తి కోసం నేత్ర వైద్యం పేరు చెప్పి ఓ అరకు నిస్తాడు. అది ప్రతి రోజూ నాలుగు చుక్కలు కంట్లో వేసుకోవాలి. అరకు ఏరోజు కారోజు కొత్తగా యిస్తాడు. ఆహారంలో తీసుకోవల సిన జాగ్రత్తల గురించి కాగితం మీద వ్రాసి స్తాడు. ఆ ప్రకారం నేనూ, గీతా సత్యానికి భోజనం ఏర్పాటు చేయాలి.

సత్యం పోషణకుగాను విశ్వనాథం నెల నెలా డబ్బిస్తాడు. బొంబాయిలో వుండే అర్భకుణ్ణి కాబట్టి నేనూ డబ్బు విషయంలో మొహమాట పడలేదు. విశ్వనాథం ఎంత మంచి వాడంటే మా యింటి అద్దెలో మూడో వంతు తనూ భరించి తీరాలన్నాడు. ఆ విధంగా మాకు బాగానే వుంది.




అది లెక్కల క్లాసు

"ఒకడు ఒక పనిని ఇరవై రోజులలో వేయగలడు. నలుగురు అదే పనిని ఎంత కాలంలో వేయ గలరు?" అడిగాడు మాష్టారు.

"ఇంతకూ అది గవర్నమెంట్ పనా. లేక ప్రైవేట్ పనా సార్?" అడిగాడు శ్రీను.

— పద్మశ్రీ, మాణిక్యారం



అన్నింటికీ మించి గౌరీశంకర్ చెప్పినట్లే నాకు జీవితం థ్రిల్లింగ్‌గా వుంటోంది.

సత్యానికి చూపు లేదు. అతడి కనుల ముందున్న రంగుల ప్రపంచం అతడికి సంబంధించినంతవరకూ శూన్యం. నా రంగుల కలలకు వాస్తవ రూపమైన గీత కూడా అతడికా శూన్యంలో ఒక భాగం.

సత్యం చూస్తూండగా మొదటి రోజునే నేను గీతను దగ్గరగా తీసుకుని పెదవులపై ముద్దుపెట్టుకున్నాను. సత్యమున్నాడన్న కంగారులో, "ఛీ, ఏమిటిది?" అంది గీత బిగ్గరగా.

"ఏమయింది?" అన్నాను ఏమీ ఎరుగనట్లు. గీత ఇబ్బందిగా సత్యం వంక చూస్తోంది. నేనూ సత్యం వంక చూస్తున్నాను. అతడి ముఖంలో ఏవో మార్పులు. ఆ మార్పులకు కారణం గీత గట్టిగా అరవడమేనని నాకు అర్థమయింది. భార్య భర్తనలా గసరడంలోని అర్థం సత్యానికి తెలియదా?

ఆ విషయం గీత చెవిలో చెప్పి, "గట్టిగా అరిస్తేనే అతడికి తెలుస్తుంది. అతడికి తెలిసినా నాకే సిగ్గూ లేదు. ఏం చేస్తావో నీ ఇష్టం" అంటూ ఆమెను మరోసారి ముద్దుపెట్టుకున్నాను. గీత గింజుకుంది తప్ప ఏమీ అనలేదు.

ఆ అనుభవం నాకు అద్భుతంగా వుంది.

నాగరికత వృద్ధి చెందడం వల్ల మరిచిపోతున్నామేమోకానీ మనిషి కూడా జంతు ప్రపంచంలో ఒక భాగం. జంతు ప్రవృత్తి మనిషినంత సులభంగా విడువదు. కొందరు క్రూర జంతువుల్లా హత్యలు చేస్తారు. కొందరు గుంటనక్కల్లా మోసాలు చేస్తారు. కొందరు పందికొక్కుల్లా పరుల సొమ్మును కాజేస్తారు. మనుషుల్లోనే కాలకూట విషమున్న కాలనాగులూ, మానవాళికి మహోపకారం చేసే సాధు జంతువులూ వుంటారు. ఆలోచనాశక్తి కారణంగా మనిషి జంతు ప్రవృత్తి నుంచి బయటపడకుంటే స్వార్థం అతణ్ణి తిరిగి జంతువుగా మార్చుతుంటుంది.

మనిషిని జంతువుగా మార్చే ప్రక్రియల్లో శృంగారం కూడా ముఖ్యమైనది. కానీ శృంగారం సృష్టికి మూలం. మనిషిలోని జంతు ప్రవృత్తిని వెలికితీసే శృంగారం భూమిపై మనిషి ఉనికికెంతో అవసరం. మిగతా జంతువుల నుండి శృంగారపరంగా కూడా తన్ను వేరు చేసుకుందుకు మనిషి వివాహాన్నీ, వావివరుసలనూ, తెరచాటు నూ సృష్టించుకున్నాడు. అయినప్పటికీ శృంగారపరంగా మనిషి జంతు ప్రవృత్తిని వదలలేదు.




'గొడుగుని వెంటేసుకొని షికార్లు కొడుతున్నా వేమిటి?' ప్రశ్నించాడు రమేష్.

'ఏం కళ్ళు సరిగా కనిపించడం లేదా? ఇది కుక్క' కోపంగా చెప్పాడు రవి.

'నేను మాట్లాడింది కుక్కతో, నీతోకాదు'

—గొల్లపూడి శైలజ

గీత ప్రతిఘటిస్తుందని తెలిస్తే నాలో కొత్త ఉత్సాహం. మామధ్య మూడో మనిషి వున్నప్పుడు నాలో నూతనోద్రేకం. ఆమె అసహాయురాలని తెలిసినప్పుడు నాలో ఏదో సంతోషం. అయితే ఆమెను నేను హింసించడంలేదని నాకు తెలుసు. అప్పుడే కదా మనిషి శృంగారానికి పరిణతి!

గీత అసహాయతను గమనించి నేనామె విషయంలో ఎంతో ముందడుగు వేశాను. ఆమె పట్ల దుశ్శాసనుడినై ఆమె నగ్న సౌందర్యాన్ని తనివితీరా చూశాను.

సిగ్గుతో కుంచించుకుపోయేదామె. కానీ కదిలితే గాజులచప్పుడవుతుందనీ, పెదవి మెదిపితే సత్యం వింటాడనీ భయం.

ఇలా ఎన్నాళ్ళు?

క్రమంగా గీత అలవాటుపడింది.

సత్యం మా గదిలో అడుగుపెట్టిన నాలుగురోజులకే గీత మేమిద్దరం వుండగానే గదిలో స్నానం ప్రారంభించింది. సత్యం కోసం గదిలో లేని తెరను స్నానం చేసే ప్రాంతాల కట్టినట్లు చెప్పేది. మొదట్లో ముదుచుకుపోయి స్నానం చేసేది. తర్వాత తర్వాత సబ్బుల అడ్వర్టయిజ్‌మెంట్ మోడల్సులా వంపు సొంపుల ప్రదర్శనతో స్నానం చేయడమే కాక నా వైపు చిలిపి చూపులు కూడా చూసేది.

సత్యం ధర్మమా అని గీతకు బిడియం పోయింది.


సత్యానికి మేము శూన్యమైతే అతడు మాకు శూన్యమయ్యాడు.

సరిగ్గా నెలరోజుల తర్వాత నేను డాక్టర్ గౌరీశంకర్ని కలుసుకుని ఆయన్ను మెచ్చుకుని థాంక్స్ చెప్పాను.

"నేనే నీకు థాంక్స్ చెప్పాలి. నా ట్రీట్‌మెంట్ వల్లనే కాక మీ ఇంట్లో వాతావరణం కారణంగా కూడా సత్యానికి జీవితమంటే ఆసక్తి పుడుతోంది. అతడిలో కొత్త ఉత్సాహం కనబడుతోంది" అన్నాడు గౌరీశంకర్.

సత్యం కారణంగా కోరుకున్న ఏకాంతం లభించి అసలు సిసలు కొత్త దంపతుల్లా వుండగల్గుతున్న మూలాన కృతజ్ఞతా భావమేర్పడి మేము సత్యాన్నెంతో అభిమానంగా చూసుకుంటున్నాం. అది అతడిపై మంచి ప్రభావాన్ని చూపి వుండాలి.

వద్దనుకున్న బంధువు వందల రోజులుండి వెడతాననడు. సత్యం మా ఇంట్లో పది వారాలు మాత్రం వున్నాడు. అతడికి తిరిగి జీవితం మీద ఆసక్తి పుట్టిందని గౌరీశంకర్ అన్నాడు. చూపానకపోయినా ఒంటరిగా ప్రయాణం చేయడానికి అనుమతినిచ్చాడు డాక్టర్ గౌరీశంకర్. సత్యానికి మినార్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్



చేయించి దగ్గరుండి ట్రయినెక్కించి పంపాం. సత్యం మాకు కృతజ్ఞతలు తెలిపాడు. మేము విరుత్సాహంగా అతడికి వీడ్కోలునిచ్చాం.

"మీ వల్లనే సత్యంలో మార్పు వచ్చింది. ఘనత నా వైద్యానిది కాదు- మీది" అని గౌరీశంకర్ నన్నూ, గీతనూ మెచ్చుకున్నాడు.

అది నిజమే కావచ్చు. సత్యం మా మధ్య వున్నాడన్న సంకోచం పోయాక మేము కాస్త విచ్చలవిడిగానే ప్రవర్తించాం. అతడికి తెలిసే అవకాశమున్నదనిపించినా అదో రకం ధైర్యం, థ్రిల్! మా అనురాగం, చొరవ, విచ్చలవిడితనం సత్యంలో జీవితం పట్ల మళ్ళీ మోజును కలిగించి వుండవచ్చు.

ఇప్పుడు సత్యం మా మధ్య లేదు. గీత వ్యవహారం మళ్ళీ మొదటికి వచ్చేలా కనబడింది. ఆమెలో మళ్ళీ బిడియం చోటు చేసుకుంటోంది. రాత్రి చీకట్లో నా దగ్గరకు చేరుతుంది కానీ పగలైనా, వెలుతురైనా అభ్యంతరపెట్టడమే కాకుండా, "జరిగినవన్నీ గుర్తుకు వచ్చి నా వళ్ళు సిగ్గుతో చచ్చిపోతోంది. వెలుగులో మీరు నన్ను తాకనైనా తాకవద్దు. అప్పుడు నాకేమయిందో ఏమో కానీ ఇప్పుడు మీకేసి కన్నెత్తి కూడా చూడలేపోతున్నాను" అంది.

నేను హతాశుడినయ్యాను. సత్యం వంటి మనిషొకడు కలకాలం మా మధ్య నుండాలంటే కుదురుతుందా? గీతకు నేనెలా నచ్చజెప్పాలా అని ఆలోచిస్తుంటే ఉపాయం తనే చెప్పింది. ఆమె బజార్నించి రెండడుగుల ఎత్తు ప్లాస్టిక్ బొమ్మను కొంది. జీవకళ వుట్టిపడే ఆ బొమ్మ నిలబెడితే కళ్ళు మూసుకుంటుంది. పడుకోబెడితే కళ్ళు




"అయ్యా, ఆకలి. పిడికెడు మెతుకులు పెట్టండి"

"పోవోయ్, ఇది ఇల్లు కాదు. ఆస్పత్రి"

"అయితే రెండు మంచి విటమిను మాత్రలు దానం చేసి పుణ్యం కట్టుకోండి."

- బంటి, మద్రాసు.

తెరుస్తుంది. బద్ధకస్థుడు నిలబడి కూడా నిద్రపోతాడనీ, నిద్రరాకపోయినా పడుకునే వుంటాడనీ దాని భావమట!

ఆ బొమ్మను సత్యంగా భావించి శృంగార జీవితాన్ని పునరుద్ధరించాలని గీత అనుకుంటోంది. ఆ ఉపాయం ఫలించినప్పుడు సత్యం ప్రభావం మా దాంపత్యంపై ఎంతలా పడిందో అర్థమయింది నాకు.

అయితే నెల్లాళ్ళ తర్వాత మా యింటికో వ్యక్తి వచ్చాడు. అతడి అన్నకు చూపు పోయిందిట. నా యింట్లో వుంచుకుంటానంటే అతడికి నేత్ర వైద్యం చేస్తానని డాక్టర్ గౌరీశంకర్ అన్నాట్ట. విశేషమేమిటంటే అతడి అన్నకు జీవితం పట్ల రవ్వంత అనాసక్తి కూడా లేదు. చూపు తెచ్చుకోవాలన్నదే అతడి కోరిక.

గౌరీశంకర్ నేత్ర వైద్యుడు కాదని నాకు తెలుసు. విషయం తెలుసుకుందామని నేను గౌరీశంకర్ని కలుసుకుంటే, "ఇప్పుడు నీకు నిజం చెప్పకతప్పదు. మొహమాటంతో సత్యం తను దాచి, నన్ను దాచమన్న రహస్యమిది. మీ ఇంట్లో సత్యానికి తన ముందు జరిగే దృశ్యాలు చూడాలన్న బలమైన కోరిక పుట్టింది. ఆ కోరిక బలంతో అతడి మెదడు కంటి లోపాన్ని సరిచేయగలిగింది. మనిషి మెదడుకున్న అద్భుత శక్తిని వెలికితీయడం సులభం కాదు. మీ దంపతుల కారణంగా అలాంటి అద్భుతం జరిగి మీ ఇంట్లో ప్రవేశించిన పది రోజులకే సత్యానికి చూపు వచ్చేసింది" అన్నాడతడు.

నేను షాక్ తిన్నాను. ఇప్పుడు సిగ్గుతో నా వళ్ళు చచ్చిపోతోంది. నేత్ర వైద్యానికి సహకరించినందుకు సంతోషించాలో నా భార్య చేత మరొకడి ముందు కాబరే ప్రదర్శనలిప్పించినందుకు ఏడవాలో తెలియక ఈ విషయం చెప్పాలని హడావుడిగా ఇంటికి వెళ్ళాను. నన్ను చూస్తూనే గీత పరుగున వచ్చి నన్ను కౌగలించుకుని నా ముఖాన్ని ముద్దులతో నింపింది. ఆమెలోని ఆ విచ్చలవిడితనానికి కారణమైన సత్యం బొమ్మవైపు అప్రయత్నంగా చూసి ఉలిక్కిపడ్డాను.

బొమ్మకు రెండు కళ్ళూ అప్పుడే విచ్చుకున్నాయి.

వెంటనే గీతను విడిపించుకుని బొమ్మను తీసి గుడ్డమూటలో కట్టేసి, "మన ఏకాంతాన్ని మూడో మనిషి ముందు ప్రదర్శించే పొరపాటు- అది నేత్ర వైద్యమైనాసరే-మళ్ళీ చేయను" అన్నాను గీతతో.


కొత్త సీరియల్

త్వరలో ప్రారంభం!!

మేడమీద అబ్బాయి

లతా పద్మినీదేవి

